క్లుప్తంగా

కార్మికుల ఖాతాల్లో జమచేయాలి



మున్సిపల్ చైర్మన్, కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నస్పూర్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు చెల్లించాల్సిన ఈపీఎఫ్, ఈఎస్ఐ డబ్బులు వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని అంబేద్కర్ మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు కొయ్యల వెంకటి డిమాండ్ చేశారు. బుధవారం ఆయన నాయకులు, కార్మికులతో కలిసి మున్సిపల్ కమిషనర్ సతీశ్, చైర్మన్ వేణుకు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని, పెంచిన జీతాలు వెంటనే అమలు చేయాలన్నారు. సంఘం గౌరవ అధ్యక్షుడు రామగిరి బానేష్, నాయకులు మాచర్ల సతీశ్, జాబ్రి హబీబ్, కురిమిల్ల రాజు, దాసరి రాజేశ్వర్, రవీందర్, మాలిక్, రాజశేఖర్, రాజేశ్వరి, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డ్రైవర్లకు స్కేలు ఇవ్వాలని వినతి



మున్సిపల్ చైర్మన్ ఉప్పలయ్యకు వినతిపత్రం అందిస్తున్న కార్మిక సంఘం నాయకులు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీలో గత కొన్నేళ్లుగా పనిచేస్తున్న 60 మంది ట్రాలీ, ట్రాక్టర్ డ్రైవర్లలో కొందరికి డ్రైవర్ స్కేలు ఇస్తున్నారని, అందరికి వర్తింపజేయాలని కార్మికులు కోరారు. కార్మిక సంఘం నాయకులతో కలిసి బుధవారం మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్యకు వినతిపత్రం అందించారు. అంబేద్కర్ మున్సిపల్ కార్మిక సంఘ గౌరవ అధ్యక్షుడు రామగిరి బానేశ్, కార్మికులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో జాతర విజయవంతం



మొక్కు చెల్లిస్తున్న జీఎం

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియాలోని ఆర్కే1ఏ గని పాలవాగు ఒడ్డున గల సమ్మక్క–సారలమ్మ గద్దెల వద్ద బుధవారం తిరుగువారం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజల్లో ఏరియా జీఎం మనోహర్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అందరి సహకారంతోనే సమ్మక్క–సారలమ్మ జాతర విజయవంతమైందని అమ్మవారి ఆశీస్సులు ప్రతీ ఒక్కరిపై ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఎస్ఓటు జీఎం రాజేశ్వర్‌రెడ్డి, ఆర్కే ఓసీ ప్రాజెక్ట్ ఆఫీసర్ గోవిందరావు, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, ఆర్కే1ఏ మేనేజర్ జయంత్, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వీడ్కోలు హంగామా



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

దండేపల్లి: మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాలలో వీడ్కోలు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పదో తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు పలికారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యం పలువురిని ఆకట్టుకుంది. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ మహేశ్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

సాదాసీదాగా సమావేశం

బెల్లంపల్లిరూరల్: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శ్రీనివాస్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా సాగింది. ఎక్సైజ్ ఎస్సై వెంకటేశ్ నివేదిక చదువుతుండగా సభ్యులు కలుగజేసుకుని గ్రామాల్లో గుడుంబా ఏరులై పారుతున్నా, బెల్ట్‌షాపులు ఇష్టారీతినా నిర్వహిస్తున్నారన్నారు. గుడుంబా తాగి కొందరు మృత్యువాత పడుతున్నా ఎక్సైజ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనాథ్ నివేదిక చదువుతుండగా సభ్యులు మాట్లాడుతూ గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న మిషన్ భగీరథ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. పంచాయతీరాజ్ ఏఈ విష్ణుకుమార్ మాట్లాడుతుండగా ఎంపీపీ, సభ్యులు కలుగజేసుకుని గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులకు ప్రొటోకాల్ ప్రకారం సమాచారం ఇవ్వాలన్నారు. జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, ఎంపీడీవో మహేందర్, ఎంపీటీసీలు సుభాష్‌రావు, మల్లమ్మ, శకుంతల, అంకు, మండల కోఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, ఇన్‌చార్జి ఏవో వందన పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

- పాఠశాలల్లో ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు



కోటపల్లి: కేజీబీవీలో సీవీ రామన్ జయంతి వేడుకల్లో విద్యార్థినులు

బెల్లంపల్లి: సీవీ రామన్ జయంతిని పురస్కరించుకుని జాతీయ సైన్స్ దినోత్సవాన్ని జిల్లావ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యాసంస్థల్లో విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రదర్శనలు ఆకట్టుకుంది. బెల్లంపల్లిలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సీఓఈ, కాసిపేట గురుకుల కళాశాలల్లో వేర్వేరుగా వేడుకల్లో ప్రిన్సిపాళ్లు ఐనాల సైదులు, ఊటూరి సంతోష్‌కుమార్ మాట్లాడారు. ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథాన్ని పెంచుకోవాలన్నారు. నేటి బాలలే రేపటి భావిభారత శాస్త్రవేత్తలని పేర్కొన్నారు. అనంతరం సైన్స్ పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులకు బహుమతి అందజేశారు. అంతకు ముందు సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వైస్ ప్రిన్సిపాల్ కోట రాజ్‌కుమార్, జేవీపీ పొన్నం రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- శాంతిఖని జెడ్పీ ఉన్నత పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచిర్యాలఅర్బన్: శ్రీచైతన్య పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. డీఎస్‌వో మధుబాబు, హెచ్ఎం జోబిన్, పీఈటీలు రాఎందర్, విలాస్ పాల్గొన్నారు.

జన్నారం: మండలంలోని లిటిల్‌హార్ట్స్, వివేకానంద పాఠశాలల్లో విద్యార్థులు చేసిన కృత్యాలను జెడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ పరిశీలించి అభినందించారు. స్లేట్ హైస్కూల్‌లో తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి హాజరై ప్రాజెక్టులను తిలకించారు. ఎంపీటీసీ స్వరూపరాణి, ఆలయ కమిటీ చైర్మన్ స్వదేశ్‌కుమార్, ఉన్నత పాఠశాల హెచ్ఎం రాజమౌళి, స్లేట్ హైస్కూల్ వ్యవస్థాపకుడు సుభాష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీకాంత్‌రెడ్డి, అడ్మినిస్టేటర్ రజిత, డీటీ రామ్మోహన్, ఆర్ఐ భాను చందర్, వివేకానంద పాఠశాల హెచ్ఎం సతీశ్‌గౌడ్, ఇన్‌చార్జి తిరుపతి ఉన్నారు.

చెన్నూర్‌రూరల్: ఆస్నాద జెడ్పీ సెకండరీ పాఠశాల విద్యార్థులు పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. హెచ్ఎం అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దండేపల్లి: పాఠశాలల్లో విద్యార్థులు సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. అంతకు ముందు సైన్స్ పితామహుడు సీవీరామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ద్వారక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటపల్లి: కేజీబీవీలో ఎస్‌వో హరిత ఆధ్వర్యంలో సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమారం: బూర్గుపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు వివిధ ప్రాజెక్టులను తయారీ ప్రదర్శించారు. హెచ్ఎం విజయ్‌కుమార్, ఉపాధ్యాయులు ఉన్నారు.

కాసిపేట: మండల కేంద్రంలోని ముత్యంపల్లి జెడ్పీ పాఠశాల విద్యార్థుల ప్రదర్శనలను ఎంపీడీవో సత్యనారాయణ సింగ్ పరిశీలించి అభినందించారు. హెచ్ఎం వెంకటేశ్వరస్వామి, ఎంపీవో నాగరాజు, ఉపాధ్యాయులు ఉన్నారు.

- మోడల్‌స్కూల్‌లో విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్‌లు వాటిని తిలకించారు. ప్రిన్సిపాల్ అందె నాగమల్లయ్య, ఉపాధ్యాయులు ఉన్నారు. ధర్మారావుపేట జెడ్పీ పాఠశాల విద్యార్థులకు పలు అంశాలపై పోటీలు నిర్వహించారు. సైన్స్ ప్రాముఖ్యతను వివరించారు. హెచ్ఎం సుధాకర్ నాయక్, ఉపాధ్యాయులు ఉన్నారు.

నస్పూర్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాలలో రాణించాలని మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు అన్నారు. తీగల్‌పహాడ్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థులు సైన్స్‌కు సంబంధించిన పరికరాలు, శాస్త్రవేత్తల చిత్రాలను, మానవశరీర అవయవాలను ముగ్గుల రూపంలో వేశారు. వేణు పరిశీలించి విద్యార్థులను అభినందించారు. హెచ్ఎం రామన్న, ఉపాధ్యాయులు ఉన్నారు.

రామకృష్ణాపూర్: తవక్కల్ పాఠశాలలో విద్యార్థులు సుమారు 300 ప్రాజెక్టులు తయారు చేసి ప్రదర్శించారు. క్యాతనపల్లి మున్సిపల్ చైర్‌పర్సన్ జంగం కళ, పట్టణ ఎస్సై రాజశేఖర్, పాఠశాల కరస్పాండెంట్ అబ్దుల్‌అజీజ్, పార్టీల నాయకులు పాల్గొన్నారు.

మంచిర్యాలరూరల్(హాజీపూర్): దొనబండ, ములకల్ల, సబ్బెపల్లిలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు సైన్స్ ప్రదర్శనలతోపాటు వారు వేసిన రంగవల్లుల రూపాలు అందరినీ అలరించాయి. సైన్స్ ఫేర్‌లలో విద్యార్థుల వివిధ ప్రయోగాలు పలువురిని ఆలోచింపజేశాయి. హెచ్ఎంలు, ఉపాధ్యాయులు ఉన్నారు.



బెల్లంపల్లి: పూలమాల వేస్తున్న సీఓఈ ప్రిన్సిపాల్



ఆస్నాద జెడ్పీఎస్ఎస్ పాఠశాలలో..



కాసిపేట: ప్రదర్శనలు పరిశీలిస్తున్న ఎంపీడీవో



జన్నారం: పరిశీలిస్తున్న జెడ్పీటీసీ



దండేపల్లి లో విద్యార్థుల సైన్స్ పరికరాల ప్రదర్శన



మంచిర్యాలఅర్బన్: విద్యార్థులు ప్రాజెక్టుల ప్రదర్శన

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు



దండేపల్లి: విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

బెల్లంపల్లి: ఇంటర్ వార్షిక పరీక్షలు బుధవారం బెల్లంపల్లిలో ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. ప్రభుత్వ బాలుర జూనియర్, బాలికల జూనియర్, సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సీఓఈ, బాలికల గురుకుల కళాశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో తొలిరోజు మొత్తం 1,279 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావల్సి ఉండగా 1,222 మంది హాజరయ్యారు. మరో 57 మంది గైర్హాజరయ్యారు. బాలుర జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో 322 మంది విద్యార్థుల్లో 307 మంది హాజరు కాగా 13 మంది గైర్హాజరయ్యారు. బాలికల జూనియర్ పరీక్ష కేంద్రంలో 319 మందికి గాను 294 మంది పరీక్ష రాయగా 25 మంది పరీక్షకు దూరంగా ఉన్నారు. బాలుర గురుకుల సీఓఈ కళాశాలలో 321 మంది విద్యార్థులకు 304 మంది పరీక్ష రాశారు. 17 మంది గైర్హాజరయ్యారు. బాలికల గురుకుల కళాశాలలో 317 మందికి 307 మంది పరీక్షకు హాజరు కాగా 10 మంది గైర్హాజరయ్యారు. ఒక్కో పరీక్ష కేంద్రం వద్ద సాయుధ పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

దండేపల్లి: ఇంటర్ వార్షిక పరీక్షలు దండేపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్ష సమయానికి గంట ముందే చేరుకున్న విద్యార్థులను సిబ్బంది తనిఖీలు చేసి లోనికి పంపారు. పరీక్షా కేంద్రాన్ని లక్సెట్టిపేట సీఐ నరేందర్ తనిఖీ చేశారు. మొత్తం 227 మంది విద్యార్థులకు గాను 221 మంది విద్యార్థులు హాజరయ్యారు. 6 మంది గైర్హాజరయ్యారు.

మందమర్రిరూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ స్కూల్‌లో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్షా కేంద్రాలను బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, ఎస్సై రాజశేఖర్, తహసీల్దార్ చంద్రశేఖర్ సందర్శించారు. పలువురు విద్యార్థులు ఆలస్యంగా కేంద్రానికి చేరుకోవడంతో ఇంటికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

కాసిపేట: ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం తెలుగు పరీక్షకు 166 మంది విద్యార్థులకు 163 మంది హాజరయ్యారు. ఇంటర్ ఒకేషనల్‌లో 42 మందికి 40 మంది పరీక్ష రాశారు. మొత్తం 208 మంది విద్యార్థులకు 203 మంది హాజరు కాగా ఐదుగురు గైర్హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా జ్యోతికుమార్, డిపార్టుమెంటల్ అధికారిగా సోమయ్య వ్యవహరించారు.

జన్నారం: మండలంలో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయగా మొత్తం 353 మంది విద్యార్థులు పరీక్షలు రాయాల్సి ఉండగా 18 మంది గైర్హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ రవీందర్‌రెడ్డి, లక్ష్మణ్ తెలిపారు.

జైపూర్: జైపూర్ జూనియర్ కళాశాలతోపాటు గురుకులం కళాశాల విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. 364 మంది విద్యార్థులకు కాను 19 మంది గైర్హాజరయ్యారు. 345 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. పరీక్ష కేంద్రాన్ని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు పరిశీలించారు.

టైలర్స్ డే వేడుకలు



మంచిర్యాలటౌన్: టైలర్లను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య

మంచిర్యాలటౌన్: అంతర్జాతీయ టైలర్స్ డే వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలో స్వచ్ఛంద పౌర సేవా సంస్థ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య పలువురు టైలర్లను సన్మానించి, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం వారితో కేక్ కట్ చేశారు. సేవా సంస్థ అధ్యక్షుడు కల్వకుంట్ల మల్లయ్య, ప్రధాన కార్యదర్శి తులా మధుసూదన్‌రావు తదితరులు ఉన్నారు.

చెన్నూర్: పట్టణంలో మేరు సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సంఘం జిల్లా అధ్యక్షులు గట్ల చందర్, రాపర్తి శ్యాంసుందర్, పెండ్యాల శ్రీనివాస్, అడుప సూర్యనారాయణ, హనుమయ్య పాల్గొన్నారు.

కాసిపేట: సోమగూడెంలో కుట్టుమిషన్ రూపకర్త విలియన్స్ హో చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆడెపు పరమేశ్వర్, మాటేటి రాజమొగిళి, వర్కర్‌లు నూరం రాజిరెడ్డి, శేఖర్, రవీందర్ ఉన్నారు.

ఉచిత విద్యుత్‌కు జీరో బిల్

నెన్నెల: జిల్లాలోని విద్యుత్ వినియోగదారులకు తెల్లరేషన్ కార్డు ఉండి అర్హులైన వారికి మార్చి 1 నుంచి 'గృహజ్యోతి' పథకం కింద 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌కు జీరో బిల్ అందిస్తామని సూపరింటెండెంట్ శేషరావు, డీఈ రాజన్న తెలిపినట్లు ఏఈ మల్లయ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజాపాలన దరఖాస్తులో ఏమైనా వివరాలు సరైనవి లేక లబ్ధిపొందక పోయిన ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల్లో సంప్రదించాలని సూచించారు.

కాసిపేట: ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి పథకం మార్గదర్శకాలు విడుదల అయ్యాయని విద్యుత్‌శాఖ ఏఈ స్వర్ణలత బుధవారం వెల్లడించారు. తెల్లరేషన్‌కార్డు కలిగిఉండి అర్హులైన లబ్ధిదారులకు మార్చి 1 నుంచి 200యూనిట్ల ఉచిత విద్యుత్‌కు జీరో బిల్లు అందించనున్నట్లు తెలిపారు.

పెండింగ్ కేసుల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న జడ్జి పర్వతపు రవి

చెన్నూర్: పెండింగ్ కేసుల పరిష్కారానికి పోలీసు అధికారులు కృషి చేయాలని చెన్నూర్ జడ్జి పర్వతపు రవి అన్నారు. మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్ విజయవంతం కోసం స్థానిక కోర్టులో బుధవారం చెన్నూర్ కోర్టు పరిధిలోని పోలీసు అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవాలన్నారు. జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్, చెన్నూర్, కోటపల్లి సీఐలు రవీందర్, సుధాకర్, న్యాయవాదులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందిస్తున్నాం



మాట్లాడుతున్న సత్యనారాయణ

చెన్నూర్: ఆధునిక హంగులతో నిర్మించిన ఆసుపత్రిలో రోగులకు మెరుగైన సేవలందిస్తున్నామని సూపరింటెండెంట్ సత్యనారాయణ అన్నారు. స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం నిర్వహించిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆసుపత్రిలో 10 మంది వైద్యులు, 15 మంది నర్సులు, ఆరోగ్య సిబ్బంది ఉన్నారని పేర్కొన్నారు. డయాలసిస్, ఆపరేషన్ థియేటర్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కోటపల్లి ఎంపీపీ సురేఖ, భీమారం జెడ్పీటీసీ భూక్య తిరుమల, మందమర్రి ఎంపీపీ మంగ, మున్సిపల్ కమిషనర్ గంగాధర్, తహసీల్దార్ మల్లికార్జున్, కౌన్సిలర్ సతీశ్, వైద్యులు మనోజ్, హెడ్ సిస్టర్ కర్ణశాల, నాగమణి, అరుణ పాల్గొన్నారు.

నిలిచిన వైస్ ఎంపీపీ ఎన్నిక

- హాజరుకాని ఎన్నికల అధికారి
- కలెక్టర్‌కు ఎంపీపీ ఫిర్యాదు



హాజరైన ఎంపీపీ, ఎంపీటీసీ, కోఆప్షన్ సభ్యులు

భీమారం: భీమారం వైస్ ఎంపీపీ ఎన్నికకు ఎన్నికల అధికారి హాజరుకాకపోవడంతో నిలిచిపోయింది. గత మూడేళ్లుగా ఖాళీగా ఉన్న ఈ పదవికి ఎన్నిక నిర్వహించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. జిల్లా సంక్షేమ అధికారి కొట్టె చిన్నయ్యను ఎన్నికల అధికారిగా నియమించింది. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు మండల సభ నిర్వహించి వైస్ ఎంపీపీని ఎన్నుకోవాలి. అయితే మండలంలో ముగ్గురు ఎంపీటీసీ సభ్యులు ఉండగా అందులో ఎంపీపీ చెర్కు దీపికారెడ్డి, ఎంపీటీసీ పెద్దల రూప, మండల కోఆప్షన్ సభ్యుడు బాబర్ ఖాన్‌లు హాజరయ్యారు. మరో ఎంపీటీసీ సభ్యురాలు చేకూర్తి సరోజన గైర్హాజరయ్యారు. ఎన్నికల అధికారి చిన్నయ్య రాక కోసం మధ్యాహ్నం 2 గంటల వరకు సభ్యులు వేచి ఉన్నారు. ఆయన హాజరుకాకపోవడంపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయంపై అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా స్పందించి జెడ్పీ సీఈవో గణపతిని భీమారం పంపించారు. ఈయన అక్కడికి చేరుకుని దాదాపు గంటపాటు సభ్యులతో చర్చించారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత చిన్నయ్య వచ్చాడు. కుటుంబ సభ్యులకు ఆరోగ్యం బాగాలేకపోవడంతో ఆలస్యమైందని సంజాయిషీ ఇచ్చారు. ఈలోగా సభకి హాజరైన ఇద్దరు సభ్యులు వెళ్లిపోయారు.

చర్య తీసుకోవాలి

ఎన్నికల అధికారి చిన్నయ్యపై చర్య తీసుకోవాలని ఎంపీపీ చెర్కు దీపికారెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు జిల్లా కలెక్టర్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు.

నేడు ఎన్నిక

ఎన్నికకు సరిపోను సభ్యులు హాజరుకానందున గురువారం మండల ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి ఎన్నిక నిర్వహిస్తామని ఎన్నికల అధికారి చిన్నయ్య తెలిపారు.

మున్సిపల్ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

మంచిర్యాలటౌన్: మున్సిపాలిటీ విభాగంలోని టౌన్ ప్లానింగ్‌లో అటెండర్‌గా పనిచేస్తున్న ఫక్రు, రెవెన్యూ డిపార్టుమెంట్‌లో బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఇర్ఫాన్‌కు కమిషనర్ మారుతి ప్రసాద్ బుధవారం షోకాజ్ నోటీసులు జారీచేశారు. ఇంటి అనుమతులు, ఇంటి నంబర్లను ఇచ్చేందుకు పలువురి నుంచి డబ్బులు వసూలు చేసినట్లుగా ఫిర్యాదు మేరకు షోకాజ్ నోటీసులు ఇచ్చినట్లు కమిషనర్ తెలిపారు. 24 గంటల్లోగా నోటీసులకు సమాధానం ఇచ్చే దానిపై తదుపరి చర్యలు తీసుంటామన్నారు.

మందమర్రి సీఐగా శశిధర్

మందమర్రిరూరల్: మందమర్రి సీఐగా శశిధర్‌ను నియమిస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇక్కడకు బదిలీపై గతనెల క్రితం రవిని నియమించగా విధుల్లో చేరలేదు. ఇక్కడ కొంతకాలం పని చేసిన మహేందర్‌రెడ్డి బదిలీపై జనగాం జిల్లాకు వెళ్లారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

జైపూర్: మండలంలోని ముదిగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్నేహ ఫౌండేషన్ ద్వారా బుధవారం ఆరు సైకిళ్లు పంపిణీ చేశారు. అమెరికాకు చెందిన సూర్య పులిపాటి, బెంగుళూర్‌కు చెందిన కౌన్సిలర్ దీప వాసుదేవ్, హైదరాబాద్‌కు చెందిన ఈర బేబి, ఉషా ఓంప్రకాశ్, కృష్ణప్రియ, చంద్రప్రకాశ్, దోమకుంట్ల హిమంక్ వర్మా, కార్తీక్‌లు స్నేహ ఫౌండేషన్ ద్వారా దూరప్రాంత విద్యార్థులకు సైకిళ్లు అందజేశారు. హెచ్ఎం రాజగోపాల్, ఉపాధ్యాయులు, స్నేహ ఫౌండేషన్ సభ్యులు కేవీ, ప్రతాప్, చిదానందకుమారి, శ్రీనివాస్, గీత, మాజీ సర్పంచ్ జ్యోతి పాల్గొన్నారు.

'పల్స్ పోలియో' జయప్రదం చేయాలి

బెల్లంపల్లి: పట్టణంలో మార్చి 3న నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారులు సుచరిత, సౌజన్య కోరారు. మున్సిపల్ కార్యాలయంలో మండల టాస్క్‌ఫోర్స్ టీమ్ సభ్యులతో బుధవారం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లక్ష్యానికి అనుగుణంగా పల్స్ పోలియో కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. మున్సిపాలిటీలో ఐదేళ్లలోపు పిల్లలు 3,264 మంది ఉన్నారని, వీరందరికి పోలియో చుక్కలు వేయాలన్నారు. ఇందుకోసం తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి రవీందర్, డీపీఎంయూ రమేశ్, పబ్లిక్ హెల్త్ మేనేజర్ మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలు ప్రాణదాతలు

జన్నారం: రక్తదాతలు ప్రాణదాతలవుతారని తహసీల్దార్ రాజమనోహర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని స్లేట్ హైస్కూల్‌లో రెడ్‌క్రాస్ సొసైటీల ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 41 మంది తల్లిదండ్రులు, పలువురు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ తలసేమియా బాధితులకు, అత్యవసర సమయంలో రక్తం అందించేందుకు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. సైన్స్ డే పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. పాఠశాల వ్యవస్థాపకుడు ఏనుగు సుభాష్‌రెడ్డి, స్లేట్ విద్యాసంస్థల చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, అడ్మినిస్ట్రేటర్ రజిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

పరీక్ష ప్యాడ్లు పంపిణీ

మందమర్రిరూరల్: పట్టణంలోని పాలచెట్టు ఏరియాలో గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో టెన్త్ విద్యార్థులకు బుధవారం కాంగ్రెస్ యూత్ రాష్ట్ర కార్యదర్శి మహంత్ అర్జున్‌కుమార్ పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు పంపిణీచేశారు. శ్రీనివాస్, కిరణ్‌కుమార్, సురేందర్, సాయి, శ్రీకాంత్, ప్రసాద్ ఉన్నారు.

భయం వీడాలి

బెల్లంపల్లి: భయం వీడి విద్యార్థులు ప్రశాంతంగా పరీక్ష రాయాలని ఎంఈవో పి.మహేశ్వర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని సింగరేణి కళావేదికలో మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న టెన్త్ విద్యార్థులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకాగ్రతతో చదివి పరీక్ష రాయడంతో ఫలితాలు సాధిస్తారని పేర్కొన్నారు. డీఎల్‌పీవో భిక్షపతి, సెక్టోరల్ అధికారి సత్యనారాయణ మూర్తి, ఎంపీడీవో మహేందర్, ఎంపీవో శ్రీనివాస్, విద్యాశాఖ కో ఆర్డినేటర్ చౌదరి పాల్గొన్నారు.

మహిళ రక్షణే షీటీం కర్తవ్యం

చెన్నూర్: మహిళ రక్షణే షీటీం కర్తవ్యమని ఎస్సై వెంకటేశ్వర్‌రావు అన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం షీటీం పై అవగాహన కల్పించారు. ఏఎస్సై ఎర్రయ్య, షీటీం కానిస్టేబుల్స్ సతీశ్, శ్రావణ్‌కుమార్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ లీగల్ ఆఫీసర్ శ్రీనివాస్, ఎంఈవో రాధాకృష్ణమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సూపరింటెండెంట్‌గా విజయ్‌కుమార్

భీమారం: మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్‌గా విజయ్‌కుమార్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. కాసిపేట నుంచి విజయ్‌కుమార్‌ని బదిలీపై భీమారం వచ్చారు.

అయోధ్యకు పయనం

బెల్లంపల్లిరూరల్: మండలంలోని చంద్రవెల్లి గ్రామానికి చెందిన పలువురు భక్తులు అయోధ్యకు పయనమయ్యారు. మంచిర్యాల రైల్వే స్టేషన్ నుంచి ప్రత్యేక రైలులో బుధవారం సాయంత్రం బయల్దేరారు.

బీమా చెక్కుల పంపిణీ

భీమారం: మండలంలోని అంకూసాపూర్‌కు చెందిన గోస్కుల లక్ష్మణ్, భీమారం గ్రామానికి చెందిన జలంపల్లి రమేశ్ మృతి చెందగా వారికి పీఎం జీవనజ్యోతి బీమా కింద మంజూరైంది. ఇందుకు సంబంధించిన రూ.4 లక్షల చెక్కులను మేనేజర్ ప్రతీక్ కుమార్, సహాయ మేనేజర్ విజయ్‌కుమార్ బుధవారం కుటుంబ సభ్యులకు అందజేశారు.